

# ప్రపంచం దేనిమీద నడుస్తోంది?

కొంపెల్ల విశ్వం

ఈ ప్రపంచం దేని మీద నడుస్తోంది?

ప్రేమ మీదా, అనురాగం మీదా, పరస్పర అవగాహన మీదా, జాలిమీదా, కరుణమీదా, మానవత్వం అనబడే దయా గుణం మీదా? దేనిమీద??

* * *

అనుకోకుండా ఇంటి మీద చుట్టాల దాడి జరగటంతో ఏం చేయాలో తోచ లేదు దయానిధికి. వచ్చిన చుట్టాలిద్దరూ కూడ తరచుగా ఎప్పుడూ వస్తూవుండే వాళ్ళు కాదు, నిర్మొహమాటంగా ప్రవర్తించదగినవాళ్ళు కాదు. ఒకడు తన బాబాయి కొడుకు. మరొకడు తన భార్య తమ్ముడూను.

రాకరాక ఇద్దరూ ఇరవై అయిదో తారీఖునే రావటం, సరిగ్గా వాళ్ళొచ్చే సమయానికే ఇంట్లో చాలా సరుకులైపోవటం, కూడబలుక్కున్నట్టు ఇద్దరూ ఒకేసారి రావటం కలవరపెట్టాయి దయానిధిని.

కలవరపడి ప్రయోజనం లేదు కాబట్టి, వచ్చిన వాళ్ళిద్దరినీ ఎంతకాలముంటారు మీరని అడగటం మర్యాద కాదు కాబట్టి— కర్తవ్య నిర్వహణలో పడ్డాడు దయానిధి.

ఫలితమే—

వాళ్ళ ఆఫీసులో రామకోటేశ్వర్రావు దగ్గిర యాభై రూపాయిల అప్పు. అప్పు చేసిన యాభైలో ముప్ఫయి రూపాయలు ఖర్చుచేసి ఇంట్లోక్కావలసినవి కొని, మిగిలిన నాలుగు అయిదు రూపాయల నోట్లు జేబులో భద్రంగా దాచుకుని ఇంటి కొచ్చాడు దయానిధి.

దయానిధి ఇంటికొచ్చిన గంటక్కానీ రాలేదు—పనిమీద వెళ్ళిన చుట్టాలిద్దరూ

వాళ్ళొచ్చాక—

ముగ్గురూ కాసేపు కబుర్లు చెప్పుకుంటూ అన్నం తిన్నారు.

అన్నం తిని, ముందుగదిలో కూచుని మళ్ళీ కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు—

"దయానిధిగారూ!" అని ఎవరో పిలవటంతో వీధిలోకెళ్లాడు దయానిధి. అతన్ని పిలిచినది జగన్నాధరావు.

"మీరా, ఏమిటిలావచ్చారు?" అంటూ అడిగాడు దయానిధి, జగన్నాధరావుని.

"ఏంలేదండి. మీరేమీ అనుకోనంటే"

"ఫరవాలేదు. చెప్పండి."

"ఇందాకటినుంచీ మిమ్మల్ని అడగాలా

వద్దా అని ఆలోచిస్తున్నాను. ఇంక వేరే మార్గం లేక ఇలా వచ్చేసాను.

"ఓ ఇరవై వుంటే సర్దగలరా, మళ్ళీ ఫస్టుకిచ్చేస్తాను." అడగలేక అడగలేక అడిగాడు జగన్నాధరావు.

"ఇరవయ్యా!" అంటూ ఆలోచనలో పడ్డాడు దయానిధి.

"అవునండి. మరో అవసరానికీ మరో అవసరానికీ అయితే ఇలా వచ్చేవాణ్ణికాదు. కానీ ఇంట్లో బియ్యం నిండుకున్నాయండి. మా రెండోవాడు ఇంతవరకూ ఆకలని గోలపెట్టి ఇప్పుడే నిద్రపోయాడు. కనీసం రేపొద్దున్నైనా ఇంట్లో వాళ్ళకి ." ఆ పైన మాట్లాడనేలేక పోయాడతను

"ఉండండి. ఇప్పుడేవస్తాను!"అంటూ లోపలికెళ్ళి జేబులోని నాలుగు అయిదు రూపాయలనోట్లలో మూడు తీసుకునివచ్చి జగన్నాధరావుకిస్తూ అన్నాడు దయానిధి—

"నే నింతకన్న సర్దలేను. ఏమీ అనుకోకండి!"

"అదేమిటండీ, ఈ మాత్రం సహాయం చేశారు. అదే పదివేలు!" అంటూ పదిహేను రూపాయలు తీసుకుని, మరోసారి కృతజ్ఞతలు చెప్పుకుని వెళ్ళిపోయాడు జగన్నాధరావు.

కాసిన్ని మంచినీళ్ళు తాగుదామని వంటింట్లోకి వెళ్ళిన దయానిధిని భార్య.

"ఎందుకొచ్చాట్ట?" అంటూ అడిగింది, ముద్ద నోట్లో వుండగానే.

డిటెక్టివ్ పుస్తకాలు కూడ ముందుగా చివర రెండు పేజీలు చదివి, సస్పెన్సేమిటో తెలుసుకున్న తర్వాతకానీ పుస్తకం చదవటాని కొప్పుకోని తత్వం ఆమెది. ఆ సంగతి బాగా తెలుసు దయానిధికి. అందుకే ఆమె పక్కగా పీట వాల్చుకుని కూచుని స్వరంతగ్గించిఅన్నాడుదయానిధి.

"ఏముంది? మనకొచ్చిన అవసరం లాటిదే! యింట్లో బియ్యం అయిపోయాయట!"

"సరే! ఆకులు నాకే వాళ్ళింటికి—"

"సర్లేగానీ మనం అప్పు చేశాం చూడు—రామకోటేశ్వర్రావు. అతని వేళ పొద్దుటే మరెవరిదగ్గరో ఓ వంద తీసుకొన్నాట్ట. ఆ వందలోంచే మనకో యాభై ఇచ్చాడు. మన యాభైలో మనం జగన్నాధరావుకి పదిహేనిచ్చాం. అంచేత .."

ఇంకా ఏదోచెప్పబోయాడు దయానిధి. చెప్పనీకుండా అడిగింది అతని భార్య—

"అయితే మీ స్నేహితులు, పరిచయస్థులు అందరూ కూడ అప్పుమీదే బతుకుతున్నా రందురూ!"

"నువ్వొక్కదానివే పిచ్చిదాన్లా వున్నావ్ అలివేలూ! మన పరిచయస్థులూ, స్నేహితులూ అన్న మాటేమిటి?? ఇంచుమించు అందరూ అప్పుమీదే బతుకుతున్నారు. అంతెందుకు? ఓ చిన్న దేశం వుందనుకో. కాస్త పెద్దదేశం దగ్గర అప్పు చేస్తుంది. ఆ పెద్దదేశం, ఇంకా స్త పెద్దదేశం దగ్గర అప్పు చేస్తుంది. పైగా చిన్నా పెద్దా దేశాలన్నిటికీ అప్పు లివ్వటానికి ప్రపంచ బ్యాంకు వుండనే వుంది. అంచేత ఈ అప్పుల గురించి నువ్వాట్టే మనసులో పెట్టుకోకు!" అనేసి ముందు గదిలోకెళ్ళిపోయాడు దయానిధి.

* * *

ఈ ప్రపంచం దేనిమీద నడుస్తోందో పాఠకులకు చెప్పవలసిన అవసరం ఇంకా వుందని—నేను అనుకోను.